క్లుప్తంగా

వార్డు కార్యదర్శులకు శిక్షణ



పటమట(విజయవాడతూర్పు): వార్డు కార్యదర్శులు వారికి కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించేందుకు, పనితీరును మరింత మెరుగు పరిచేందుకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వీఎంసీ అదనపు కమిషనర్(ప్రాజెక్ట్స్) కె.వి సత్యవతి అన్నారు. కమిషనర్-డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆదేశాలతో గొల్లపూడిలోని గోగినేని టవర్స్‌లో వార్డు కార్యదర్శుల శిక్షణ శిబిరాన్ని ఆమె బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొదటి బ్యాచ్‌లో మొత్తం 65 మంది కార్యదర్శులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్-2 అనసూయదేవి పాల్గొన్నారు.

తెలుగు కళామతల్లి ముద్దుబిడ్డ బళ్లారి రాఘవ



మధురానగర్(విజయవాడసెంట్రల్): తొలితరం తెలుగు కళామతల్లి ముద్దుబిడ్డ బళ్లారి రాఘవ అని నాటక రంగానికి ఆయన చేసిన సేవలు నిరుపమానమని డిప్యూటీ మాజీ మేయర్ సామంతపూడి నరసరాజు పేర్కొన్నారు. స్థానిక ముత్యాలంపాడు అల్లూరి సీతారామరాజు గ్రంథాలయం వజ్రోత్సవాలలో భాగంగా బుధవారం నాటకరంగ ప్రముఖులు బళ్లారి రాఘవ జయంతి వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక సంఘం అధ్యక్ష,కార్యదర్శులు ఎస్ వెంకటేశ్వరరాజు, డీ భాస్కరరాజు కోశాధికారి డీజేపీఎస్‌రాజు, గ్రంథాలయం అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బరాజు, సుబ్బరాజుతో కలిసి బళ్లారి రాఘవ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఎంతో శ్రేష్టం



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఎంతో శ్రేష్టమైనవని, ఆరు నెలల వరకూ బిడ్డకు తల్లిపాలను తప్పనిసరిగా పట్టించాలని 57వ డివిజన్ కార్పొరేటర్ ఇసరపు దేవి అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలలో భాగంగా న్యూరాజరాజేశ్వరీపేటలో బుధవారం అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తల్లిపాలలో ఎన్నో పోషకాలు ఉన్నాయన్నారు. బిడ్డ పుట్టిన గంటలోపు తల్లిపాలను పట్టించడం మరింత మంచిదన్నారు. ఐసీడీఎస్-1 డివిజన సూపర్‌వైజర్ ప్రమీల, ఏఎస్‌ఎంలు నాగమణి, కమలమ్మ, శివకుమారి పాల్గొన్నారు.

విశ్రాంత హోంగార్డ్ కుటుంబానికి ఆర్థిక సాయం



భవానీపురం(విజయవాడపశ్చిమ): పదవీ విరమణ చేసిన హోంగార్డ్ కుటుంబానికి పోలీస్ కమిషనర్ టీకే రాణా ఆర్థిక సాయం అందచేశారు. విజయవాడ నగరంలో పని చేస్తున్న హోంగార్డ్‌ల్లో ఎవరైనా మరణించినా లేదా పదవీ విరమణ చేసినా వారు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా నగరంలో పని చేస్తున్న హోంగార్డులు అందరూ స్వచ్ఛందంగా వారికి ప్రతి నెలా వచ్చే వేతనం నుంచి ఆయా హోంగార్డ్ కుటుంబాలకు ఆర్థిక ఆసరా కల్పిస్తున్న సంగతి తెలిసిందే. ఎన్టీఆర్ జిల్లాలో హోంగార్డ్‌గా విధులు నిర్వహిస్తున్న జయపాల్ గత నెల 15వ తేదీన పదవీ విరమణ చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో కమిషనర్ టీకే రాణా జయపాల్‌కు రూ.5లక్షల చెక్కును అందజేశారు.

వ్యక్తిపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మహిళపై దాడికి పాల్పడిన వ్యక్తిపై కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు చేపల మార్కెట్, శివాలయం ప్రాంతానికి చెందిన ఎండీ షేర్‌బాను, షహీన్ షా భార్యభర్తలు. వీరికి ఇద్దరు కుమార్తెలు కాగా వారికి వివాహాలయ్యాయి. చిన్న అల్లుడు గౌస్, స్నేహితుడైన ఇంతియాజ్ ఇద్దరు కలిసి ఆన్‌లైన్‌లో వస్తువులు తెప్పించుకున్నారు. కొద్ది రోజులుగా ఇంతియాజ్ షేర్‌బాను ఇంటికి వచ్చి గౌస్ కోసం ఆరా తీస్తున్నాడు. ఇంతియాజ్ వచ్చిన సమయంలో గౌస్ ఇంట్లో ఉండటం లేదు. మంగళవారం అదేవిధంగా ఇంటికి వచ్చి ఆరా తీశాడు. గౌస్ ఇంట్లో లేడని ఇంతియాజ్‌కు చెప్పడంతో కోపంతో షేర్‌బానుపై దాడి చేశాడు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం

ఎమ్మెల్యే విష్ణు



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

పాయకాపురం(విజయవాడరూరల్): జన సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 62వ డివిజన్ 271వ వార్డు సచివాలయ పరిధిలో బుధవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ అలంపూరు విజయలక్ష్మితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఎల్బీఎస్ నగర్లో విస్తృతంగా పర్యటించి 322 గడపలను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులకు ప్రజల నుంచి ఆత్మీయస్వాగతం లభించింది. తమ ఇంటికి విచ్చేసిన ఎమ్మెల్యేని ప్రజలు సాదరంగా ఆహ్వానించి ఆప్యాయంగా పలకరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాలను అసామాన్యంగా అమలు చేస్తూ ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారన్నారు. ఏమైనా సమస్యలున్నా, అర్హులై ఉండి పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఆయన దృష్టికి తీసుకొచ్చిన పలు సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే తాగునీరు వచ్చే సమయాన్ని సచివాలయ గ్రూపుల్లో షేర్ చేయాలని సిబ్బందికి సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. విద్యార్థుల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సంపూర్ణ పోషణ సరుకులను నేరుగా లబ్ధిదారుల ఇళ్లవద్దకే తీసుకెళ్లి అందజేయాలని సూచించారు. . అనంతరం మీడియాతో మాట్లాడారు.

విశ్వసనీయత ప్రతీకగా సీఎం జగన్ సర్కారు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో పెట్టుబడులకు ఏపీ కేంద్రంగా మారడాన్ని జీర్ణించులేక, పచ్చ నేతలకు కంటి మీద కునుకు ఉండటం లేదని ఎమ్మెల్యే విష్ణు పేర్కొన్నారు. చంద్రబాబు పాలనలో పారిశ్రామిక అభివృద్ధి అంటే కేవలం కాగితాల మీదనే జరిగేదని విమర్శించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ఏటా రూ. వేల కోట్ల పెట్టుబడులు గ్రౌండ్ అవుతున్నట్లు వెల్లడించారు. సాక్షాత్తూ మహేంద్ర సత్యం అధినేత ఏపీ ముఖ్యమంత్రిని ఆదర్శంగా తీసుకోవాలని తన కుమారుడికి చెప్పడం , సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనదక్షతకు అద్దం పడుతోందన్నారు. విపక్షాల తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీడీఓ జగదీశ్వరి, నాయకులు అలంపూరు విజయ్, వీరబాబు, రామిరెడ్డి, బోరాబుజ్జి, మస్తాన్, బ్రహ్మేంద్ర, వెంకట్, మహేష్, నాగేశ్వరావు, గ్రేసీ, సుభాన్, రెడ్డెమ్మ, శివపార్వతి తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం

డీసీపీ విశాల్ గున్నీ



స్థానికులతో మాట్లాడుతున్న డీసీపీ విశాల్ గున్నీ

గుణదల (విజయవాడ తూర్పు): అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపి శాంతి భద్రతలు పరిరక్షించే దిశగా పోలీసు విభాగం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని డీసీపీ విశాల్ గున్నీ తెలిపారు. మాచవరం పోలీస్ స్టేషన్‌ను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పనితీరు, విధులు, వంటి విషయాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమైన కేసుల దర్యాప్తు, వివిధ క్రైం రికార్డులను పరిశీలించారు. మాచవరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం స్టేషన్ పరిధిలోని గంగిరెడ్డుల దిబ్బ కొండ ప్రాంతంలో పర్యటించారు.

స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసు యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. శాంతి భద్రతలకు సంబంధించిన ఏ సమస్యలైనా పోలీసులకు తెలపాలని స్థానికులను కోరారు. మాచవరం సీఐ గుణరామ్, ఎస్సైలు నాగమణి, తేజ పాల్గొన్నారు.

గొప్ప మనసున్న సీఎం వైఎస్ జగన్

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



ఇబ్రహీం తల్లికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): పేదల ఆపద్బాంధవుడిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని ప్లానింగ్ బోర్డు వైస్ ఛైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. స్థానిక 59వ డివిజన్ సింగ్ నగర్ ప్రాంతానికి చెందిన షేక్ ఇబ్రహీం(29) క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ ఇటీవల మృతిచెందాడు. ఆ పేద కుటుంబ సభ్యులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన ఎమ్మెల్యే విష్ణు విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన తన నిధుల నుంచి మూడు లక్షల రూపాయలను మంజూరు చేసి, వారి బాసటగా నిలిచారు. దీనికి సంబంధించిన చెక్కును ఎమ్మెల్యే విష్ణు బుధవారం ఇబ్రహీం కుటుంబ సభ్యులకు అందజేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేసిన సాయం ఎన్నటికీ మరచిపోలేనిదన్నారు. తమ జీవితాంతం ఆయనకు రుణపడి ఉంటామని ఇబ్రహీం తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు తెలిపారు.

నిత్య స్మరణీయుడు పింగళి వెంకయ్య

రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు మల్లాది విష్ణు



దుర్గాపురంలో పింగళి వెంకయ్య జయంతి వేడుకలలో మాట్లాడుతున్న మల్లాది విష్ణు



పింగళి వెంకయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తోట శ్రీనివాస్

మధురానగర్(విజయవాడసెంట్రల్): తెలుగు జాతి ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన పింగళి వెంకయ్య నిత్య స్మరణీయులని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. దుర్గాపురం వాకర్స్ క్లబ్ వద్ద బుధవారం పింగళి వెంకయ్య జయంతి వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడిగా, మహాత్మాగాంధీకి అత్యంత విధేయుడిగా, జాతీయ జెండా రూపకర్తగా పింగళి వెంకయ్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచారన్నారు. సరిగ్గా వందేళ్ల క్రితం 1921 మార్చి 31న విజయవాడ వేదికగా భారత జాతీయ పతాక రూపకల్పనకు అంకురార్పణ జరిగిందన్నారు. లక్నో, నాగపూర్, కలకత్తా వంటి ప్రాంతాల్లో జరిగిన స్వాతంత్ర్యోద్యమ సమావేశాలలో జాతీయోద్యమ నాయకులు బ్రిటిష్ పతాకం ఆవిష్కరించడం చూసిన వెంకయ్య ఎంతో ఆవేదన చెందారన్నారు. మనకంటూ ఒక జాతీయ జెండా ఉండాలనే భావనతో విజయవాడలో కాంగ్రెస్ సదస్సు జరిగినపుడు కొన్ని పతాకాల నమూనాలు తయారు చేసి గాంధీకి చూపించడంతో.. త్రివర్ణ పతాకానికి ఒక రూపాన్ని ఇచ్చారన్నారు. ఆ విధంగా ఆయన రూపొందించిన జాతీయ పతాకం త్రివర్ణ శోభితమై కోట్లాది మంది హృదయాల్లో నిలిచిందన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలోనూ కీలక భూమిక పోషించి.. ప్రతి ఒక్కరిలో ఉద్యమ స్ఫూర్తి రగిలించిందని తెలిపారు. ఆ మహనీయుని సేవలను ఈ దేశం ఎప్పటికీ మరువదని చెప్పారు. కార్యక్రమంలో బీ గాంధీ, పీ వంశీ, మురళి పాల్గొన్నారు

పింగళి స్ఫూర్తితో దేశానికి సేవ చేయాలి

జాతీయపతాక రూపకర్త కృష్ణాజిల్లా వాసి కావటం మన గర్వకారణం అని ఆయన స్ఫూర్తితో దేశానికి సేవలు అందించాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి తోట శ్రీనివాస్ అన్నారు. స్థానిక ముత్యాలంపాడులో బుధవారం పింగళి వెంకయ్య జయంతి వేడుకలు జరిగాయి. పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ 61వ డివిజన్ అధ్యక్షుడు బల్లం కిషోర్, నాయకులు దాసం దుర్గారావు, డీ అశోక్, కె ఫణికుమార్, ఎం కోటి, కె తులసీరామ్, దాసు, శ్రీనివాసరావు, అన్నపురెడ్డి రామిరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు అభివృద్ధి పనులు వేగవంతం

రూ.3.65 కోట్లతో పనులు



కండ్రిక వద్ద రోడ్డు పనులు పర్యవేక్షిస్తున్న వీఎంసీ ఈఈ శ్రీనివాస్

పాయకాపురం(విజయవాడరూరల్): కండ్రిక జంక్షన్‌వద్ద ఆర్అండ్‌బీ రోడ్డు ఎండ్‌టూఎండ్ పావర్ బ్లాక్స్ అండ్ రోడ్డు వెడల్పు చేసే అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. రోడ్డు పనులను వీఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు శ్రీనివాస్ బుధవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కండ్రిక జంక్షన్ వద్ద నూజివీడు ఆర్అండ్‌బీ రోడ్డు వెంబడి సైకిల్‌ట్రాక్, వాకింగ్ ట్రాక్, గ్రీనరీ ఉండే విధంగా రోడ్డు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.3.65 కోట్లతో నిర్మించే పవర్‌బ్లాక్స్ వలన దుమ్ముధూళి తగ్గించేందుకు ప్రాధాన్యం ఇస్తూ పనులు జరుగుతున్నాయన్నారు. నగరంలో మొదటి విడతగా ఎయిర్ క్వాలిటీ ఇంప్రూవ్‌మెంట్ రోడ్డు నిర్మాణం జరుగుతుందన్నారు. ప్రకాష్‌నగర్ నుంచి సుమారు 400 మీటర్ల పొడవు వుండేలా నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు.

స్టేడియం నిర్మాణ పనుల పరిశీలన



స్టేడియం నిర్మాణ పనులను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): పశ్చిమ నియోజకవర్గం విద్యాధరపురంలో నిర్మించనున్న స్టేడియం నిర్మాణ పనులను కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బుధవారం సాయంత్రం అధికారులతో కలిసి పరిశీలించి పలు సూచనలు చేశారు. స్టేడియం ఫౌండేషన్ నిర్మాణ పనులను పరిశీలించి అక్కడ ఉన్న వర్షపునీటిని గుంటలను యుద్ధప్రాతిపదికన పూడ్చాలని, వర్షపునీటిని డ్రెయిన్‌లకు మళ్లించాలని ఆదేశించారు. అవసరమైన చోట్ల మోటార్లు ఏర్పాటు చేసి ఎక్కడ వర్షపు నీరు నిల్వలు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆయన కొత్తపేట కె.టి రోడ్‌లో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. నెహ్రూ బొమ్మ సెంటర్ నుంచి చిట్టినగర్ జంక్షన్ వరకు ఒక వైపు రోడ్ పనులు అన్నీ పూర్తయినందున ట్రాఫిక్ వ్యవస్థకు ఇబ్బంది కలుగకుండా రోడ్ పై ఉన్న నిర్మాణపు సామగ్రి, మట్టిని తొలగించి రోడ్డును వెంటనే వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నారాయణ మూర్తి పాల్గొన్నారు

తుది దశకు స్మృతివనం పనులు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ స్వరాజ్యమైదానంలో జరుగుతున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహం, స్మృతివనం పనులు తుది దశకు చేరుకున్నాయని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఆయన విగ్రహ నిర్మాణ పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ నడిబొడ్డున సీఎం వైఎస్ జగన్ సారథ్యంలో చేపడుతున్న 125 అడుగుల అంబేద్కర్ స్మృతి వనాన్ని పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దనున్నామని తెలిపారు. అంబేద్కర్ స్మృతి వనంలోపల నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులకు సూచించామన్నారు. కేపీసీ ప్రాజెక్టు డైరెక్టర్ కె.అనిల్‌కుమార్ మేనేజర్ కె.కృష్ణమోహన్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న సీఎం



58వ డివిజన్‌లో వైఎస్సార్ పోషణ కిట్లను పంపిణీ చేస్తున్న డెప్యూటీ మేయర్ శ్రీశైలజ



57వ డివిజన్ న్యూఆర్ఆర్‌పేటలో సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ



59వ డివిజన్ సింగ్‌నగర్‌లో పోషకాహార కిట్ల పంపిణీ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించి, వారికి చక్కని ఆరోగ్యాన్ని అందించడంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ అన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ కార్యక్రమం స్థానిక 58వ డివిజన్‌లో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల ద్వారా పోషక విలువలు అధికంగా ఉండే ఆహారాన్ని అందిస్తున్నామని తెలిపారు.

57వ డివిజన్‌లో..

స్థానిక 57వ డివిజన్ న్యూరాజరాజేశ్వరీపేటలోని 233వ వార్డ్ సచివాలయం వద్ద వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. స్థానిక కార్పొరేటర్ ఇసరపు దేవి, ఐసీడీఎస్-1 సూపర్‌వైజర్ ప్రమీల పాల్గొని గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ పోషణ కిట్ల ఉపయోగాలను వివరించారు. చైల్డ్‌ఫండ్ కో-ఆర్డినేటర్ టైసన్, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్లు లత, ప్రసాద్, సచివాలయం డబ్ల్యూపీఎస్ కవిత, సుజ్ఞానం, గాయత్రి, ఏఎస్‌ఎంలు నాగమణి, కమలమ్మ, శివకుమారి పాల్గొన్నారు.

59వ డివిజన్‌లో..

స్థానిక 59వ డివిజన్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. స్థానిక కార్పొరేటర్ ఎండీ షాహీనాసుల్తానా, ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రం డాక్టర్ సైరాభాను, సూపర్‌వైజర్ వి.విజయ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



32వ డివిజన్‌లో పోషణ కిట్లను పంపిణీ చేస్తున్న కో-ఆప్షన్ సభ్యురాలు సుభాషిణి

పోషణ కిట్లతో సంపూర్ణ ఆరోగ్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లతో గర్భిణులకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని కో-ఆప్షన్ సభ్యురాలు గుండే సుభాషిణి అన్నారు. స్థానిక 32వ డివిజన్‌లో బుధవారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోమ్ రేషన్ పంపిణీ ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ భవ్య, అంగన్‌వాడీ టీచర్లు రమాదేవి, అనిత, పూర్ణిమ, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి గుండే సుందర్‌పాల్ పాల్గొన్నారు.

27వ డివిజన్‌లో..

27వ డివిజన్ దుర్గాపురంలో బుధవారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోమ్ రేషన్ పంపిణీ కార్యక్రమం జరిగింది. స్థానిక కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి బాలింతలకు పోషణ కిట్‌లను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు రాము పాల్గొన్నారు.

43వ డివిజన్‌లో..

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): 43వ డివిజన్ పరిధిలోని ఊర్మిళ నగర్ అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణలో భాగంగా టేక్ హోమ్ రేషన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బాపతి కోటిరెడ్డి పాల్గొని గర్భిణులు, బాలింతలకు కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మాగం ఆత్మా రాము , అంగన్ వాడీ టీచర్లు జ్యోతి, సరస్వతి, శారద, తిరుపతమ్మ, గిరిజ, ఆశా వర్కర్స్ పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

పాయకాపురం(విజయవాడరూరల్): గర్భిణులు పోషకాహారం తీసుకుంటే ఆరోగ్యవంతమైన బిడ్డలు జన్మిస్తారని కార్పొరేటర్ అలంపూరు విజయలక్ష్మి అన్నారు. 62వ డివిజన్ కమ్యూనిటీ హాలు నందు గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ పోషణ సరుకులను(కిట్లు) కార్పొరేటర్ విజయలక్ష్మీ బుధవారం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అలంపూరు విజయ్, మస్తాన్, వెంకట్, శ్రీనివాస్, రెడ్డెమ్మ, సూపర్‌వైజర్ నాగమణి పాల్గొన్నారు.

61వ డివిజన్ హెచ్ బ్లాక్ నందు..

గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ సరుకులను బుధవారం అందజేశారు. 64వ డివిజన్‌లో అంగన్‌వాడీ ప్రీస్కూల్ నందు కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ వైఎస్సార్ పోషణ కిట్లను అందజేశారు.



43వ డివిజన్‌లో పోషణ కిట్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ కోటిరెడ్డి



వైఎస్సార్ కిట్లు అందజేస్తున్న కార్పొరేటర్ విజయలక్ష్మి



27వ డివిజన్‌లో పోషణ కిట్లను అందజేస్తున్న కార్పొరేటర్ మల్లీశ్వరి

ఆరోగ్యకేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యకేంద్రం సేవలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యకర జీవనం సాగించాలని మధురానగర్ ఆరోగ్యకేంద్రం వైద్యులు డాక్టర్ అంజు సూచించారు. స్థానిక మధురానగర్ ఆరోగ్యకేంద్రంలో బుధవారం ఆరోగ్య అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె వర్షాలు కురుస్తున్న దృష్ట్యా కాచిచల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. అలాగే ఏ మాత్రం అనారోగ్య సమస్యలు వచ్చినా సమీపంలోని ఆరోగ్యకేంద్రంలో సంప్రదించాలన్నారు. ఆశ కార్యకర్తల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. అనంతరం గర్భిణులు, చిన్నారులకు వ్యాక్సిన్ వేశారు.

మణిపూర్ ఘటన దురదృష్టకరం



శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

గుణదల (విజయవాడ తూర్పు): దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్న ప్రస్తుత తరుణంలో కొంత మంది మత ఛాందసులు చేస్తున్న ఆకృత్యాలు సిగ్గు చేటని పలువురు క్రైస్తవులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల మణిపూర్‌లో జరిగిన దుర్ఘటనకు వ్యతిరేకంగా గుణదలలోని బిషప్ గ్రాసి పాఠశాల నుంచీ బీఆర్‌టీఎస్ రోడ్డు వరకు శాంతిర్యాలీని బుధవారం నిర్వహించారు. క్రైస్తవ సంగీత కళాకారుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ క్రైస్తవ గాయకుడు స్టీవెన్ సన్ మాట్లాడుతూ భారత దేశం లౌకిక రాజ్యమని. ఇక్కడ అన్ని కులాల, మతాలకు చెందిన ప్రజలు జీవించే హక్కు ఉందని స్పష్టం చేశారు. క్రైస్తవుల పై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వాయిద్య కళాకారులు, గాయకులు ప్లకార్డులు చేతపట్టి శాంతి ర్యాలీ నిర్వహించారు. గుణదల బిషప్ గ్రాసి పాఠశాల ప్రాంగణం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలి బీఆర్‌టీఎస్ రోడ్డు వరకు కొనసాగింది. కార్యక్రమంలో పాస్టర్లు కోట కరుణకుమార్, జాన్ వెస్లీ, దానియెల్ రత్నం పాల్గొన్నారు.

రేపు సంకట చతుర్థి

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్త సాయి శివకామేశ్వరీపీఠంలో శుక్రవారం సంకటచతుర్థి సందర్భంగా శ్రీవిజయగణపతి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పీఠం వ్యవస్థాపకులు అవ్వా హేమసుందర వరప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లోక కళ్యాణార్థం స్వామికి రుద్రాభిషేకం, అర్చనలు జరుగుతాయన్నారు.